# 22-ఏ నిషేధిత భూముల జాబితాల రూపకల్పనలో అత్యంత జాగ్రత్త వహించాలి

## దేవాదాయ శాఖ భూములపై ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించాలి

### అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత

**జగిత్యాల, సెప్టెంబర్2,(నవగీతం)** జిల్లాలోని దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను 22-ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చే ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాల తయారీ, పరిశీలన మరియు తుది ఖరారుపై జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీమతి సుప్రియ మరియు ఆ శాఖ సిబ్బందితో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత మాట్లాడుతూ..దేవాలయాలు మరియు ఇతర దేవాదాయ సంస్థలకు చెందిన భూముల సర్వే నంబర్లు, ఉప విభాగ సంఖ్యలు, విస్తీర్ణం, భూమి వర్గీకరణ, యాజమాన్య వివరాలు, రెవెన్యూ మరియు దేవాదాయ శాఖ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే 22-ఏ జాబితాలను తుది ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, సంబంధిత రికార్డులను పరస్పరం సరిచూసుకోవాలని ఆదేశించారు. దేవాదాయ భూములు పొరపాటున జాబితా నుంచి మినహాయించబడకుండా, అలాగే తప్పుడు సర్వే నంబర్లు లేదా విస్తీర్ణాలు నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ మరియు దేవాదాయ శాఖ ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఎలాంటి లోపాలు, అనధికార మార్పులు లేదా మినహాయింపులు చోటుచేసుకోకుండా ప్రతి ప్రతిపాదనను బాధ్యతాయుతంగా పరిశీలించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, దేవాదాయ శాఖ రిజిస్టర్లు మరియు ఇతర ఆధారాలను సమగ్రంగా ధృవీకరించిన అనంతరమే జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు.దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, సంబంధిత భూముల విషయంలో ప్రభుత్వ ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.



నిర్ణీత గడువులోగా సమగ్రంగా పరిశీలించిన, దోషరహితమైన తుది 22-ఏ నిషేధిత భూముల జాబితాలను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లాలోని తహసీల్దార్లు, కరీంనగర్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శ్రీమతి సుప్రియ, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం విజయవంతంగా 1000 రోజులు పూర్తి

## తల్లాడ ప్రభుత్వ హాస్టల్లో కేక్ కట్ చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి

**తల్లాడ,సెప్టెంబర్, 02(నవగీతం):** తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు తల్లాడ ప్రభుత్వ హాస్టల్లో తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా గొడుగునురి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ
తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి అనేక పథకాలు, సంస్కరణలు తీసుకుంటుందన్నారు . ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడమే ఈ ప్రభుత్వం లక్ష్యం అన్నారు.విద్యను కేవలం చదువుకే పరిమితం చేయకుండా, జీవన నైపుణ్యాలు మరియు ఉపాధి అవకాశాలతో కలిపి ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుందన్నారు.
ప్రస్తుతం ప్రభుత్వ దృష్టి పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు ఒక సమగ్రమైన విద్యా విధానాన్ని రూపొందించడంపై ఉందన్నారు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధమైన విద్యా వ్యవస్థ, నైపుణ్య ఆధారిత బోధన, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు దవిద్యార్థులు పాఠశాల దశ నుంచే భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్, కౌన్సెలింగ్, జీవన విలువలు నేర్చుకునేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు అలాగే గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులు, విద్యార్థుల నమోదు, నాణ్యమైన బోధనపై కూడా ప్రత్యేక దృష్టి సారించి విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత విద్య అల్పాహారం పథకం కింద సంక్షేమ కార్యక్రమాలు చేస్తుందన్నారు ప్రభుత్వ పాఠశాల చదివే విద్యార్థులకు బ్యాగులు యూనిఫార్మ్ షూస్ సౌకర్యాలు కల్పించారన్నారు. ఉదయం ప్రైమ్ రి పాఠశాల విద్యార్థులకు సీఎం బ్రేక్ఫాస్ట్ అల్పాహారం సౌకర్యాన్ని కూడా విద్యార్థులకు ఏర్పాటు చేశారన్నారు అంతేకాకుండా నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయబోతుందన్నారు .
విదేశాల్లో చదివే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థుల కోసం స్కాలర్షిప్లను కూడా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలోని ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి జక్కంపూడి కిషోర, పొట్రూ శరత్, తాళ్ల జోసెఫ్ , వెంకటనారాయణ రెడ్డి,, శ్రీనివాస్ రెడ్డి , హరీష్ రెడ్డి,బసవయ్య హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# కాంగ్రెస్ మోసపూరిత పాలనపై తిరగబడదాం

**బిఆర్ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం.**

**కాంగ్రెస్ వైఫల్యాలపై రాష్ట్రమంతా సర్వత్ర నిరసన జ్వాలలు.**

**తల్లాడలో రైతులతో బిఆర్ఎస్ మహా ర్యాలీ**



**తల్లాడ, సెప్టెంబర్ 02(నవగీతం):** శాసనసభ ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,13 డిక్లరేషన్,420 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తల్లాడ మండల కేంద్రంలో గురువారం మహా నిరసన ర్యాలీ, మరియు ధర్నా నిర్వహించారు. సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.యూరియా కొరతపై ధ్వజం:కేసీఆర్ హయాంలో రైతులు ఏ రోజూ ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడే పరిస్థితి రాలేదని,ఫోన్ చేసి చెబితే నేరుగా షాపులకు వెళ్లి ఎరువులు తెచ్చుకునే వారని గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ పాలనలో యూరియా, ఎరువుల కోసం గంటల తరబడి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని మండిపడ్డారు.యాప్‌ల పేరుతో గందరగోళం నిరక్షరాస్యులైన పేద రైతులు,స్మార్ట్‌ఫోన్లు లేని వారికి అవగాహన లేకుండా కొత్త యాప్‌లను ప్రవేశపెట్టి రైతులకు సకాలంలో ఎరువులు అందకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఊసే లేకుండా పోయిందని, ప్రచారానికే పరిమితమైన కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలు మరచి,సంక్షేమాలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం దానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా నాయకుడు తెలంగాణ జాతిపిత కెసిఆర్ ను ప్రతిపక్ష హోదాకు రాజీనామా చేయమని బుకాయిస్తున్నాడని. నిజంగా మన రాష్ట్రానికి కనీస పాలన అవగాహన లేని నాయకున్ని ఎన్నుకున్నందుకు రాష్ట్ర ప్రజలు సిగ్గుపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.ఇకనైనా ప్రతిపక్షాలపై అనవసర ఆరోపణలు మానుకొని ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రికి హితవు పలికారు.ఈ ర్యాలీ కార్యక్రమంలో పలువురు స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు,రైతు విభాగ ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు,రైతులు ప్రజలు యువకులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలి

**తల్లాడ, సెప్టెంబర్ 02(నవగీతం):** నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలను నియంత్రించాలని పెరుగుతున్న ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీ పిలుపుతో బుధవారం తల్లాడ మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో యుడిసికి ప్రతినిధి బృందం వినతి పత్రం అందించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తల్లాడ ఏన్కూర్ సంయుక్త మండల కార్యదర్శి కే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశంలో రాష్ట్రంలో సగటు మనిషి వినియోగించుకునే నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆయిల్ పప్పులు ఇతర వస్తువుల ధరలు పెరుగుదల ఎక్కువగా ఉందని దీని నియంత్రించడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని వారు ఈ సందర్భంగా ఆరోపించారు పేద మధ్య తరగతి ప్రజలు కొనుగోలు శక్తిని కోల్పోయే అవకాశం ఉందని వారన్నారు. నేడు రాష్ట్రంలో వర్షాలు లేక పంటలు లేక పేద ప్రజలు పనులు లేకపోవడం వల్ల ప్రత్యామ్నాయమ ఉపాధి అవకాశాలు లేకపోవడం వలన అర్ధాకరితో జీవిస్తున్నారని ఈ తరుణంలో ఏకంగా ఉల్లిగడ్డలు పంచదార ఆయిల్ పప్పు దినుసులు తదితర వస్తువుల ధరలు పేద ప్రజలకి అందుబాటులో లేకుండా పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు నియంత్రించడంలో పాలకవర్గాలు పేద ప్రజల్ని దృష్టిలో పెట్టుకొని నియంత్రించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు గొడ్ల పుల్లమ్మ షేక్ జాన్మియా వెంకటేశ్వర్లు రాఘవ నారాయణ యూసుఫ్ బిక్షం విష్ణు పుల్లయ్య నాతనిలే పాల్గొన్నారు



## కొడిమ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల విభాగంలో పద్య పఠన పోటీలు



**కొడిమ్యాల, సెప్టెంబర్ 02(నవగీతం)** జగిత్యాల జిల్లా తెలుగు భాషా ఫోరం ఆధ్వర్యంలో కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికల విభాగంలో బుధవారం మండలస్థాయి పద్య పఠన పోటీలు నిర్వహించారు.మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి మాట్లాడుతూ నేటి కాలంలో పద్య పఠనానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. నీతి పద్యాలను చదవడం ద్వారా విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కవి నాగభూషణం చారి, పండితులు రామాచారి వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అలాగే భాషా ఉపాధ్యాయులు, న్యాయ నిర్ణేతలు, విద్యాధికారిని నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు.కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయేంద్ర అధ్యక్షతన తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బహుమతులు అందుకున్నారు. విజేతలు జిల్లా స్థాయిలో నిర్వహించే పద్య పఠన పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ తెలుగు భాషా ఉపాధ్యాయులు వెంకట రమణ, కే. అనిత, ఏ. శేఖర్, సుమన్, అంజయ్య, సరోజన తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి, మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వంపై సమరభేరి

**ఆరు గ్యారంటీల అమలులో వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ భారీ ధర్నా**

**420 అడుగుల హామీల ఫ్లెక్సీతో రోడ్ ప్రదర్శన..**

**కోరుట్లలో ఏమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో**





**జగిత్యాల/కోరుట్ల, ెసెప్టెంబర్2,(నవగీతం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు.దఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ప్రతీకగా 420 అడుగుల భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, కోరుట్ల బస్ స్టాండ్ అంబేద్కర్ చౌరస్తా నుంచి రోడ్ ప్రదర్శన నిర్వహించారు. ఈ భారీ ఫ్లెక్సీలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను ప్రదర్శిస్తూ, వాటిలో ఎన్ని అమలయ్యాయి, ఇంకా ఎన్ని హామీలు నెరవేరాల్సి ఉందో ప్రజలకు తెలియజేసేలా ప్రదర్శన చేపట్టారు. భారీ ఫ్లెక్సీతో నిర్వహించిన ఈ ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడిచినా ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఎమ్మెల్యే సంజయ్ గారు పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నించేందుకే ఈ పోరాటం చేపట్టామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ధర్నా అనంతరం నిర్వహించిన 420 అడుగుల భారీ ఫ్లెక్సీ రోడ్ ప్రదర్శనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుండంపల్లిలో విద్యార్థులకు పుస్తకాలు, షూస్ పంపిణీ



**మల్లాపూర్,సెప్టెంబర్2,(నవగీతం):** మల్లాపూర్ మండలం గుండంపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థులకు గ్రామ సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా షూస్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దప్పుల పద్మ నర్సయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ హెచ్ఎం ఎల్. శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం చంద్ర ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
3 సెప్టెంబర్ 2026



## శ్రీకృష్ణుడిగా రామ్ చరణ్.. అంత పెద్ద రిస్క్ చేస్తాడా?



ఒకప్పుడు ఓ భాషలో సినిమా హిట్ అయిందంటే చాలు.. మరో భాషలో రీమేక్ చేసేందుకు పోటీ పడేవారు. కథ నచ్చితే చాలు స్టార్ హీరోలు సైతం రీమేక్‌లకు సై అనేవారు. అయితే పాన్ ఇండియా సినిమాల హవా మొదలైన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒక భాషలో హిట్ అయిన సినిమాను మరో భాషలో రీమేక్ చేయడం కంటే.. అదే సినిమాను డబ్ చేసి ఇతర భాషల్లో విడుదల చేయడానికే మేకర్స్ ఆసక్తి చూపిస్తున్నారు. ఇలాంటి సమయంలో టాలీవుడ్‌లో ఓ సూపర్‌హిట్ గుజరాతీ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. అంతేకాదు.. ఇందులో శ్రీకృష్ణుడి పాత్ర కోసం మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ పేరును పరిశీలిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**రూ.50 లక్షలతో సినిమా.. రూ.100 కోట్లకు పైగా వసూళ్లు**

గత ఏడాది గుజరాతీలో విడుదలైన 'లాలో -- కృష్ణ సదా సహాయతే' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. కేవలం రూ.50 లక్షల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. చిన్న బడ్జెట్‌తో తెరకెక్కి భారీ విజయాన్ని అందుకోవడంతో ఈ సినిమా పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. అదే దక్షిణాదిలో అయితే రూ.50 లక్షలతో సినిమా తీయడం సంగతి పక్కన పెడితే.. ఆ మొత్తంతో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించడం కూడా కష్టమేననే కామెంట్లు వినిపించాయి. ఈ నేపథ్యంలో 'లాలో'ను తెలుగులో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు మొదలైనట్లు సమాచారం. ఈ రీమేక్‌లో కీలకమైన శ్రీకృష్ణుడి పాత్రను రామ్ చరణ్‌తో చేయించాలని మేకర్స్ భావిస్తున్నట్లు టాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

'లాలో -- కృష్ణ సదా సహాయతే' కథ విషయానికొస్తే.. లాలో అనే ఆటో డ్రైవర్ తన భార్యను ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. అయితే కొన్ని కారణాల వల్ల భార్యతో గొడవపడి తీవ్రంగా కుంగిపోతాడు. జీవితంలో ఎదురైన సమస్యలను మర్చిపోవడానికి చెడు అలవాట్లకు బానిసవుతాడు. పరిస్థితులు మరింత దిగజారడంతో ఓ నిర్మానుష్య ప్రదేశంలో తలదాచుకుంటాడు. అలాంటి సమయంలో మనిషి రూపంలో శ్రీకృష్ణుడు అతని జీవితంలోకి వస్తాడు. లాలోతో స్నేహం చేస్తూ.. అతని జీవితాన్ని నెమ్మదిగా మార్చే ప్రయత్నం చేస్తాడు. పైకి చూస్తే చాలా సింపుల్‌గా అనిపించే కథే అయినప్పటికీ.. భావోద్వేగాలను బలంగా పండిస్తూ, కథలో మంచి లోతును చూపించడంతో సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ చిత్రానికి అంకిత్ సకియా దర్శకత్వం వహించారు. ఎమోషనల్ కంటెంట్ ప్రధాన బలంగా నిలవడంతో చిన్న సినిమా కాస్తా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. తెలుగు రీమేక్‌కు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం కూడా ప్రచారంలో ఉంది. ఈ సినిమాను తెరకెక్కించేందుకు తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ పేరును టీమ్ పరిశీలిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు.

## ఇక సీరియస్... కామెడీని బ్యాలెన్స్ చేస్తా: 'అల్లరి' నరేశ్

"ప్రేక్షకులు నా నుంచి 'కితకితలు, బెండు అప్పారావు' వంటి వినోదాత్మక సినిమాలు మిస్ అవుతున్నారు. అలాంటి సినిమాలు చేయాలనుకుంటున్నప్పుడు చంద్రమోహన్ 'రంభ ఊర్వశి మేనక' కథ చెప్పారు. ఈ కథ నాతో పాటు నాగార్జున, సుప్రియ, రాజేష్, నిమ్మకాయల ప్రసాద్‌గార్లకు కూడా నచ్చింది. ఇలా చాలా రోజుల తర్వాత 'రంభ ఊర్వశి మేనక' వంటి వినోదాత్మక చిత్రం చేశాను" అని 'అల్లరి' నరేశ్ తెలిపారు. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్ హీరోగా నటించిన చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. సురభి హీరోయిన్‌గా నటించారు. అన్నపూర్ణ స్టూడియోస్--హాస్య మూవీస్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం 'అల్లరి' నరేశ్ విలేకరులతో పంచుకున్న విశేషాలు... ఫ్యాంటసీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఇందులో హీరోకి ఒక డ్రామా కంపెనీ ఉంటుంది. 'రంభ ఊర్వశి మేనక'ను దేవతల్లా పూజిస్తుంటాడు. పైగా కష్టపడకుండా హీరో అయి పోవాలనే పాత్ర. తన కుటుంబానికి ముత్తాతల నుంచి వస్తున్న ఒక పుస్తకం ఉంటుంది. అందులో ఒకప్యాట్రన్ గీస్తే దేవతలు వచ్చి కోరికలు తీరుస్తారనే నమ్మకం ఉంటుంది. హీరో ఆప్యాట్రన్ ఎలా గీశాడు? రంభ, ఊర్వశి, మేనక భువికి వచ్చిన తర్వాత ఎలాంటి ఘటనలు జరిగాయనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సినిమాలో మంచి ఎమోషన్ కూడా ఉంది. నా బాడీ లాంగ్వేజ్‌కి సరిపడే కామెడీని చంద్రశేఖర్ బాగా డిజైన్ చేశారు. పైగా ప్రేక్షకులు స్వర్గం, నరకం, ఇంద్రలోకం లాంటి కథలు చూసి చాలా కాలమైంది. పెద్దలే కాదు... చిన్నపిల్లలూ చాలా ఎగ్జయిట్ అవుతారు. క్లీన్ కామెడీతో ఫ్యామిలీ అందరూ కలిసి చూసేలా ఈ సినిమా ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'రంభ ఊర్వశి మేనక' మా నాన్నగారి (ఈవీవీ సత్యనారాయణ) శైలిలో చేసిన సినిమా. అంత పెద్ద స్టార్ కాస్ట్ ఇందులో ఉంది. ఇకపై రెండు కామెడీ సినిమాలు, ఒక సీరియస్ సినిమా ఇలా బ్యాలెన్స్ చేసుకుంటూ చేయాలని భావిస్తున్నాను. నటుడిగా ఇంకా విజయవంతమైన చిత్రాలు చేసిన తర్వాతే దర్శకత్వం గురించి ఆలోచిస్తాను. నేను నటించిన 'ఆల్కహాల్' మూవీ రిలీజ్ రెడీగా ఉంది. 'కనకదుర్గ' సినిమా షూటింగ్ జరుగుతోంది.

## 'మా రాముడు అందరివాడు' చిత్రంపై భారీ అంచనాలు..



తెలుగు సినీ పరిశ్రమలో మరో వైవిధ్యమైన కంటెంట్‌తో కూడిన చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. శ్రీరామ్, స్వాతి మందాడి ప్రధాన జంటగా నటించిన తాజా చిత్రం 'మా రాముడు అందరివాడు'. అనుముల ప్రొడక్షన్స్ మరియు శ్రీరామ్ క్రియేషన్స్ పతాకాలపై అనుముల లక్ష్మణరావు, పల్లకొండ శ్రీరాములు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. యుద్ధనపూడి మైకిల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని, సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదలకు ముస్తాబైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుక చిత్ర పరిశ్రమలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో టాలీవుడ్ సీనియర్ నటుడు సుమన్ ముఖ్యమంత్రి పాత్రలో కనిపించనుండగా, నిర్మాత అనుముల లక్ష్మణరావు వైల్డ్ విలన్‌గా విభిన్నమైన షేడ్స్‌లో అలరించనున్నారు. సమ్మెట గాంధీ, నాగ మహేష్, బాహుబలి ప్రభాకర్, ఆనంద భారతి, గడ్డం నవీన్, చిట్టిబాబు, గోల్డ్ రెడ్డి తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. సుమారు 200లకు పైగా థియేటర్లలో విడుదలవుతున్న ఈ సినిమాపై చిత్ర యూనిట్ ఎంతో నమ్మకంతో ఉంది. ప్రీ రిలీజ్ వేడుకలో చిత్ర బృందం పంచుకున్న విశేషాలు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన నిర్మాత వెంకట్ దుగ్గిరెడ్డి, దర్శకుడు శ్రీనివాస తేజ చిత్ర యూనిట్‌కు బెస్ట్ విషెస్ తెలిపారు. ఈ సినిమా ఘన విజయం సాధించి టీమ్‌కు మంచి పేరు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీనియర్ నటుడు సుమన్ మాట్లాడుతూ, ఇండస్ట్రీలో గ్లామర్ కంటే టాలెంట్ శాశ్వతమని, హీరో శ్రీరామ్‌లో అద్భుతమైన నైపుణ్యం ఉందని కొనియాడారు. ఇందులో తాను ఒక ముఖ్యమంత్రి పాత్రలో కనిపిస్తానని, సమాజానికి మంచి సందేశం ఇచ్చే పాత్ర ఇదని చెప్పారు. దర్శకుడు మైకిల్ ప్రతి విషయంలోనూ మంచి క్లారిటీతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని, ట్విస్టులు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయని తెలిపారు. దర్శకుడు యుద్ధనపూడి మైకిల్ మాట్లాడుతూ, సుమారు పద్నాలుగు నెలల పాటు ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ ఈ ప్రయాణం సాగించామని తెలిపారు. కేవలం డైరెక్షనే కాకుండా కథ, మాటలు, పాటలు రాసి, రెండు పాటలకు కొరియోగ్రఫీ కూడా అందించినట్లు పేర్కొన్నారు. మారెడుమిల్లి ఫారెస్ట్ నేపథ్యంతో సాగే ఈ చిత్రంలో తండ్రీ కొడుకుల మధ్య వచ్చే ఎమోషన్స్ ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయని, అందరికీ ఫుల్ మీల్స్ లాంటి సినిమా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. హీరో శ్రీరామ్ మాట్లాడుతూ, చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా కంటెంట్‌ను మాత్రమే ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. తెలుగు ప్రేక్షకులు మన సినిమాలను మనమే ప్రోత్సహించుకుంటేనే మరింత ముందుకు వెళ్లగలమని, ఈ చిత్రంలో బలమైన కంటెంట్, దమ్మున్న సన్నివేశాలు ఉన్నాయని చెప్పారు. తన కెరీర్‌లో ఇది మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాత లక్ష్మణరావు మాట్లాడుతూ, ఫస్టాఫ్‌లో 20 ఏళ్లు ఎమ్మెల్యేగా అరాచకాలు సృష్టించే వైల్డ్ విలన్‌గా తాను నటించానని, సీఎంగా సుమన్గారితో వచ్చే సన్నివేశాలు అదిరిపోతాయని తెలిపారు. ట్రైలర్ చూసిన తర్వాత అందరూ అభినందిస్తున్నారని, ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి సినిమాను విజయవంతం చేయాలని కోరారు.




## యుగాన్ని నిర్వచించిన రాజు

కన్నడ అగ్ర నటుడు కిచ్చా సుదీప్ నటిస్తున్న పీరియాడిక్ చిత్రానికి 'దేవరాయ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో ఆయన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయ పాత్రలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. బుధవారం సుదీప్ పుట్టినరోజు సందర్భంగా టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. శ్రీకృష్ణదేవరాయలు పాత్రలో సుదీప్ రాజసం ఉట్టిపడుతూ కనిపిస్తున్నారు. 'చరిత్రను మలిచిన సామ్రాజ్యం. ఒక యుగాన్ని నిర్వచించిన రాజు. కాలాన్ని దాటి జీవించే ఓ లెజెండ్' అంటూ దేవరాయ పాత్రను పరిచయం చేశారు. అలనాటి విజయనగర సామ్రాజ్య వైభవాన్ని ఆవిష్కరిస్తూ భారీ హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, వచ్చే ఏడాది డిసెంబర్‌లో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001. Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184. Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.